సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: హెచ్‌ఎంటీహిల్స్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అడ్డగుట్ట ఫీడర్ పరిధిలోని భాగ్యనగర్‌కాలనీ ఫేజ్ 3, ఎంఎన్ ఆర్ స్కూల్, ఆదిత్యానగర్, శుభోదయా కాలనీ, తులసీనగర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినాయక ఫీడర్ పరిధిలోని హెచ్ఎంటీ, శాతవాహన నగర్‌లలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

17న హరిహరక్షేత్రంలో శివరాత్రి మహోత్సవాలు

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని హరిహరక్షేత్రంలో శివరాత్రి త్రయానిక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణసూరి తెలిపారు. 17వ తేదీన సాయంత్రం గణపతి హోమం, రుద్ర హోమం, 18వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 3.30 నుంచి రుద్రాభిషేకాలు, సాయంత్రం 7గంటలకు రుద్రహోమం, రాత్రి 9గంటలకు శివపార్వతుల కల్యాణం, రాత్రి 12గంటలకు లింగోద్భావ అభిషేకాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆదివారం పూర్ణాహుతి ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

'శ్రీనివాసుడిని పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయి'



శ్రీవారి కల్యాణోత్సవానికి సహకరించిన వారితో నలమాల్పు అంజిరెడ్డి, శ్యాంప్రసాద్

మోతీనగర్: కలియుగ దైవం శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు నలమాల్పు అంజిరెడ్డి, శ్రీనివాస కల్యాణం ట్రస్ట్ బండి కళ్ల శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఇటీవల మోతీనగర్‌లో నెల రోజుల పాటు శ్రీవారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకరించిన ప్రతి ఒక్కరికి మంగళవారం మోతీనగర్ కమ్యూనిటీ హాలులో సన్మానించి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ... ప్రతి వ్యక్తి సంపాదించిన దానిలో కొంతైనా సమాజ, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ అభివృద్ధి మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్, సత్యనారాయణ, కిరణ్మయి, ఏవీ రాజు, వీరభద్రయ్య, మల్లాది విజయలక్ష్మి, కంచర్ల శ్రీనివాసరావు, వెంకటస్వామి, చిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి క్యూసమ్ ఈ-స్కూటర్

కుత్బుల్లాపూర్: హీరో మోటో కార్ప్‌లో సరికొత్త టెక్నాలజీతో 110సీసీ క్యూమ్ ఈ స్కూటర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. సరికొత్త ఫీచర్లతో నగర మార్కెట్‌లోకి వచ్చిన ఈ స్కూటర్ ఎల్ఎక్స్, యూఎక్స్, ఎక్స్‌టెక్ మూడు వేరియంట్లలో లభిస్తుందని హీరో సంస్థ తెలంగాణ ఏరియా మేనేజర్ మనీష్ జైన్ తెలిపారు. మంగళవారం సుచిత్రలోని గీతా హీరోషోరూంలో ఈ స్కూటర్‌ను ఎస్‌బీఐ అఫీషియల్స్ రవిబాబు, హిమబిందులు ముఖ్యఅతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ మూడు వేరియంట్ల ధరలు రూ.72,749, 75,899, 80,899లుగా ఉన్నాయని సేల్స్ మేనేజర్ వినీత్, టెరిటరీ మేనేజర్ బిబెక్ పాత్ర, కుషాగ్ర శర్మ తెలిపారు. వినియోగదారులు సుచిత్రలోని గీతా హీరో షోరూంకు వచ్చి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

స్పాసెంటర్ ముసుగులో వ్యభిచారం

నిర్వాహకుడి అరెస్టు

భాగ్యనగర్‌కాలనీ: స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఇంటిపై కూకట్‌పల్లి ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన వెంకట నరసింహారాజు (31) సూరారంలోని చిత్తారమ్మ దేవాలయం సమీపంలో నివాసం ఉటున్నాడు. కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలోని లావిష్ బ్యూటీ పార్లర్, వెల్‌నెస్ స్పా నిర్వహిస్తున్నాడు. స్పా సెంటర్ ముసుగులో విటులను రప్పించి వాట్సప్‌లో మహిళల ఫొటోలు పంపుతూ విటులకు ఎరవేసి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ, కూకట్‌పల్లి పోలీసులు ఇంటిపై దాడి చేసి నిర్వాహకుడితో పాటు నలుగురు విటులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరికి చెరువు కబ్జా!

మాయమవుతున్న చెరువు భూములు

- తులసీనగర్ నుంచి నిర్మాణ వ్యర్థాల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్లు
- చెరువును మట్టితో నింపేస్తున్న వైనం
- ఆమ్యామ్యాలకు అలవాటు పడిన అధికారులు
- చర్యలు తీసుకోని సంబంధిత శాఖ అధికారులు



భూదేవిహిల్స్‌లోని పరికి చెరువును టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టి పోస్తూ చదును చేస్తున్న కబ్జాదారులు

అల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండలం భూదేవిహిల్స్‌లోని గొలుసు కట్టు చెరువైన పరికి చెరువు మట్టి డంపింగ్‌లతో కబ్జాదారుల కనుసన్నల్లో కబలించేస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా చెరువును మట్టితో నింపేస్తున్నారు. చెరువులను కాపాడాల్సిన వారే వారి కళ్లముందే కబ్జా అవుతున్నా పట్టించుకోకుండా పబ్బం గడుపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మిషన్ కాకతీయలో ఈ చెరువు లేకపోవడం గమనార్హం..

▲ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నగరంలోని గొలుసుకట్టు చెరువులను మిషన్ కాకతీయ పథకం ద్వారా పూడికతీత పనులు చేపట్టి చెరువులను ఆధునీకరించి మినీ టాంక్‌బండ్‌లా తీర్చిదిద్దాలని ఆదేశించినప్పటికీ భూ బకాసురులు అందించే ఆమ్యామ్యాలకు అలవాటు పడి చెరువు భూములను మాయం చేస్తున్నారు. ఈ చెరువును మిషన్ కాకతీయ పథకంలో లేకుండా చేశారని స్థానిక యువత మండిపడుతున్నారు.

ట్విట్టర్ పోస్ట్‌పై హడావుడి చేసిన అధికారులు

▲ కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలో రాత్రికి రాత్రే టిప్పర్లతో ఇళ్లను కూల్చిన వ్యర్థాలను తీసుకువచ్చి నింపుతున్నారు. మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌కి స్థానిక యువత చెరువు కబ్జా జరుగుతున్న విషయాన్ని పోస్ట్ చేశారు. అధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకున్నారే కానీ, మట్టిని పూడ్చి కబ్జాలు చేసిన వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

అధికారులు కళ్లులేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారు..

▲ కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ మండలాల సరిహద్దుల ప్రాంతాల్లో కబ్జాదారులు మట్టిని తీసుకువచ్చి నింపుతూ ఆక్రమించుకోవటం నిత్యకృత్యంగా మారింది. స్థానికంగా జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్, స్థానికంగానే కూకట్‌పల్లి మండల కార్యాలయం, కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయాలు ఉన్నప్పటికి వాటి ముందర నుంచే చెత్తా చెదారం, మట్టితో కూడిన టిప్పర్లు తీసుకువచ్చి నింపుతున్నా తమకు కళ్లు లేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండి పడుతున్నారు.

తహసీల్దార్ బదిలీ కావటంతో...

▲ పరికి చెరువు పూడ్చడం వల్ల మండల, పోలీస్, సర్కిల్ అధికారులకు కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయనేది అందిరికీ తెలిసిందేనని స్థానికులు పేర్కొంటున్నారు. కొన్ని రోజుల క్రితం కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ ఈ చెరువుపై ప్రత్యేక దృష్టి సారించి చెరువు కబ్జా కాకుండా టిప్పర్లు, ట్రాక్టర్లపై కబ్జా చేసే వారిపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకున్నారు. ఉన్నట్టుండి ఆ తహసీల్దార్ బదిలీ కావటంతో యథేచ్ఛగా చెరువును కబ్జా చేసుకుంటున్నారని చెబుతున్నారు. దీంతో చెరువు కబ్జా పర్వం కొనసాగుతోంది.



తులసీనగర్ కాలనీలో నుంచి పరికి చెరువులో నిర్మాణ వ్యర్థాలను పోయటానికి వెళ్తున్న ట్రాక్టర్లు

ప్లాట్లుగా చేసి అమాయకులకు విక్రయాలు..

▲ ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లుగా విభజించి అమాయకులకు అంటగట్టి కోట్లు దండుకుంటున్నారు. ప్రైవేట్ భూమి నెపంతో స్థానిక భూ యజమాని ఈ చెరువు కూడా తమలోకే వస్తుందంటూ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ బోర్డులను తొలగించారని స్థానికులు చెబుతున్నారు. దాని పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని సైతం తన గుప్పిట్లోకి తీసుకున్నారని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు, పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. అయినా మండల, ఇరిగేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఎకరాల కొద్ది చెరువు కబ్జా..



ప్రతి రోజూ ట్రాక్టర్లు, టిప్పర్లు ద్వారా ఇళ్లు కూల్చిన వ్యర్థాలను తమ కాలనీ నుంచి తీసుకువచ్చి స్థానికంగా ఉన్న భూదేవి హిల్స్ పరికి చెరువులో పోసి పూడ్చి వేస్తున్నారు. ఇప్పటికే ఎకరాల కొద్ది చెరువు కబ్జాకు గురయ్యింది. ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ వంటి దిమ్మలను సైతం కనుమరుగు చేశారు. భవిష్యత్ తరాలకు చెరువులే లేకుండా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చెరువు ప్రాంతాన్ని పరిశీలించాలి. చెరువును పూడ్చి వేయిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలి.

– రామకృష్ణ, తులసీనగర్ వాసి

ఎంతటి వారైనా ఉపేక్షించం..

పరికి చెరువును మట్టితో పూడుస్తున్న విషయం ప్రస్తుతానికి మా నోటీసులో లేదు. చెరువును పరిశీలించి కబ్జాకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టి తరలించే వారిపై కూడా చర్యలతో పాటు వాటిని సీల్ చేస్తాం. కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. చెరువు ప్రదేశాలను పరిశీలించి కూల్చివేత చేపట్టి పూర్తిగా నేలమట్టం చేస్తాం.

– గోవర్ధన్, కూకట్‌పల్లి తహసీల్దార్

నేడు సంత్ గురు శ్రీ సేవా లాల్ మహారాజ్ జయంతి

మోతీనగర్: జై తుల్జా భవాని బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం అల్లాపూర్ డివిజన్ కమిటీహాలులో సంత్ గురు శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆర్. బద్రునాయక్, ఆర్.భాస్కర్‌నాయక్, ఆర్. కళ్యాణనాయక్, మడావత్ గోపాల్‌నాయక్ తెలిపారు. ఉదయం 9 గంటలకు భోగ్ బండార్ కార్యక్రమంతో జయంతి వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మహారాజ్‌కు పంచామృతంతో అభిషేకం, హోమం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం పాల్గొనున్నట్లు తెలిపారు. బంజారా సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

లారీ ఢీకొట్టడంతో నేలకొరిగిన 5 స్తంభాలు



దూలపల్లి రోడ్డులో విరిగి పడిన స్తంభాలు

జీడిమెట్ల: జీడిమెట్ల నుంచి దూలపల్లి వెళ్లే రోడ్డులో 5 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఉదయం 5గంటల సమయంలో స్థానికులు గ్రహించి జీడిమెట్ల విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న జేఈ కృష్ణ సంఘటన స్థలానికి వెళ్లి స్థానికంగా ఉన్న సీసీ కెమరాలను వీక్షించారు. అందులో ఓ లారీ స్తంభాలను ఢీకొట్టి వెళ్లినట్లు గుర్తించి పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రాత్రిపూట చీకటిగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

గోడ కూల్చిన వ్యక్తితోనే పునర్నిర్మించేలా చూడాలి

డీసీకి సాయినగర్ ఈస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతి



కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయి నగర్ ఈస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న గోడని కూల్చివేయటంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈస్ట్ సాయినగర్ రోడ్డు నం.6లో వీధి చివర భద్రత గురించి ప్రతి ఇంటి సభ్యుల అభిప్రాయం మేరకు గోడను నిర్మించామన్నారు. ఆల్విన్‌కాలనీ ఫేజ్–1కు చెందిన పి.సూర్య ప్రకాష్‌రావు అనే పక్కకాలనీ సభ్యుడు తమ కాలనీ వీధిలో గేటు నిర్మించారని తెలిపారు. ఆయనకు లే అవుట్‌లో ఇటువైపు దారి లేదన్నారు. మెయిన్ రోడ్డులో నుంచే దారి ఉందని తెలిపారు. ఆయన దౌర్జన్యంగా గోడను కూల్చి దాని స్థానంలో గేటు నిర్మించారని తెలిపారు. కాలనీ అధ్యక్షుడు ఇటు పక్కన గేటు పెట్టవద్దని ఆయనను కోరితే దురుసుగా మాట్లాడారని అన్నారు. ఆయనను పిలిపించి తిరిగి గోడను నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మంగళవారం డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆమోర్ ఆసుపత్రి వైద్యుల ఘనత

- బాబుపై వేడినీళ్లు పడి తీవ్రగాయాలు
- విజయవంతంగా చికిత్స చేసిన వైద్యులు

కూకట్‌పల్లి: ప్రమాదవశాత్తు ఓ చిన్నారిపై వేడినీళ్లు పడి సుమారు 35 శాతం గాయాలయ్యాయి. దీంతో ఆ చిన్నారిని కూకట్‌పల్లిలోని ఆమోర్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా చిన్నారికి చికిత్సను అందించిన ఆసుపత్రికి చెందిన ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ కన్సల్టెంట్ డాక్టర్ బాదం అభినందన్ వివరించారు. వేడినీళ్లు పడిన బాబుకు మాడు, మెడ, వీపు, రెండు చేతులు, చంకలు కాలాయి. అవన్నీ సెకండ్ గ్రేడ్ గాయాలని, చర్మం లోపలి వరకు కాలిందని పరీక్షల్లో గుర్తించామని తెలిపారు.

● 20 శాతం కంటే ఎక్కువ గాయాలైతే రక్తం పరిమాణం తగ్గడం, ఎండ్ ఆర్గాన్ పెర్ఫ్యూజన్ వల్ల షాక్‌కు కారణమవుతాయని వివరించారు. చికిత్సలో ఆలస్యమైతే వివిధ అవయవాలు విఫలమై మరణం సంభవిస్తుందన్నారు. పిల్లల వైద్య నిపుణులు, క్రిటికల్ కేర్ బృందం సాయంతో ఇన్‌ఫెక్షన్లు వ్యాపించకుండా యాంటీబయాటిక్స్ ఇచ్చామన్నారు. చిన్నారికి గాయాల నుంచి ఫ్లూయిడ్, ప్రోటీన్లు గానీ పోకుండా ఉండేలా కొలాజెన్ కాపాడుతుందన్నారు. దీనివల్ల డ్రెసింగ్ ఎక్కువ అవసరం లేదన్నారు. చికిత్స అనంతరం నోటి ద్వారా ఆహారం ఇవ్వాలని తల్లికి సూచించామని తెలిపారు. పదోరోజు డిశ్చార్జి చేశామని అమోర్ ఆసుపత్రి వైద్యులు అభినందన్ తెలిపారు.



వేడినీళ్లు పడి కాలిన శరీరంతో చిన్నారి



కొలాజెన్ చికిత్స చేసి కాపాడిన వైద్యులు

హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ బస్తీలోని హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమతకు మంగళవారం సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్ మాట్లాడుతూ... హిందూ శ్మశానవాటికలో అంతర్గత రోడ్లు, బైపోల్ స్తంభాలు, విద్యుత్ లైట్లు స్నానాల గదులు, శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ, బర్నింగ్ స్లాబ్స్, సిమెంట్ బల్లలతో పాటు రెండు వాహనాలు ఏర్పాటు చేయాలని లేఖలో పేర్కొన్నారు. వెంటనే స్పందించిన జోనల్ కమిషనర్ మమత త్వరలో శ్మశానవాటికను పరిశీలించి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారని అందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బి. శ్రీను, డి. మహేష్‌గౌడ్, సాదా మహేష్, అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

పార్కు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సర్కిల్‌లోని ఎల్ఈడీ థీమ్ పార్కు మూసాపేట సర్కిల్‌లోని ఎన్విరాన్‌మెంటల్ పార్కుల్లో జరుగుతున్న పనులను జోనల్ కమిషనర్ వి.మమత ఇంజినీరింగ్, హార్టికల్చర్ అధికారులతో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ పార్కుల్లో పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

సైనికా.. నీ త్యాగం వృథా కాదు



పుల్వామా దాడిలో అమరులైన సైనికులకు నివాళులర్పిస్తున్న రవికుమార్‌యాదవ్, బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: బీజేపీ సీనియర్ నాయకులు నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో పుల్వామా ఉగ్రవాదుల దాడి ఘటనలో అమరులైన సైనికులకు మంగళవారం నివాళులర్పించారు. ఉగ్రదాడిలో అమరులైన వీరుల త్యాగం ఈ దేశం ఎన్నటికీ మరువదన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 14వ తేదీని చీకటి అధ్యాయంగా అభివర్ణించి బ్లాక్ డేగా నిర్ణయించిందన్నారు. దేశ సరిహద్దుల్లో దేశహితం కోసం పనిచేసే సైనికులకు ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. పుల్వామా దాడిలో అమరులైన సైనికుల ఆశయాలను కొనసాగిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, బీజేవైఎం నేషనల్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్, నర్సింగ్ యాదవ్, నరసింహచారి, వేణుయాదవ్, చారి, అనిల్, బాలు యాదవ్, గోపాల్‌రావు, భాస్కర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, వెంకట్, రఘు, శ్రీకాంత్, భూపాల్‌రెడ్డి, జయరాజు, దేవిరెడ్డి, జ్యోతి, విమల, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో హాత్ సే హాత్ జోడో యాత్ర



యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేకల రమేష్ ఆధ్వర్యంలో మంగళవా రం ఇంటింటికి హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి రాహుల్‌గాంధీ జోడో యాత్ర సందేశంతో కూడిన కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ చౌదరి, గూడెపు నాగరాజు, జ్యోతి, గోవింద్ గౌడ్, గురుమూర్తి, నాగార్జున, గణేష్, కళ్యాణ్, అనిల్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పోరాటం ఆపేది లేదు

బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్



అడ్డగుట్టలో సమస్యలను తెలుసుకునేందుకు పర్యటిస్తున్న గజ్జల యోగానంద్ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: స్థానిక హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అడ్డగుట్టలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్ మంగళవారం పాదయాత్ర చేపట్టారు. డ్రైనేజీ, నీరు, ట్రాఫిక్, విద్యుత్, పార్కింగ్ వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అడ్డగుట్టలో ఉన్న రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ, కరెంట్ తీగల పరిస్థితి చూస్తే అర్థం అవుతుందన్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేసే బీఆర్ఎస్ నాయకులకు కాలనీలో ప్రజలు పడుతున్న పార్కింగ్ సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. సామాన్యులపై విద్యుత్ చార్జీల మోత మోపే నాయకులకు రోడ్ల మధ్యలో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ప్రమాదంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు కనపడవా అని ప్రశ్నించారు. ఎనిమిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. హామీ ఇచ్చిన పనులు అన్ని నెరవేర్చే వరకు ఈ పాదయాత్ర ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెలగ శ్రీనివాస్, విజిత్, ప్రభాకర్, రామాంజనేయరెడ్డి, రామకృష్ణ, నవీన్‌గౌడ్, కృష్ణంరాజు, బ్రహ్మయ్య, రఘు, రత్నకుమార్, సిద్దూ, లడ్డూ, నర్సింహ, చంద్రమోహన్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు శర్మ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు శర్మ, హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు వీఎస్ఎస్‌సీఎస్ శర్మ, ప్రధానోపాధ్యాయుడు సి. నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 2023 కేలండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శర్మ మాట్లాడుతూ... ప్రస్తుతం పదోన్నతుల బదిలీల షెడ్యూల్ విడుదల ప్రక్రియ కొనసాగుతుండగా అందులో భాషా పండితుల పదోన్నతులు కోర్టు కేసు ఉందన్న కారణంతో పక్కకు పెట్టారన్నారు. ఉన్నతాధికారులు భాషా పండితులకు కేసుపై ఉన్న స్టేని ఎత్తివేస్తే ఈ షెడ్యూల్లో భాషా పండితుల పదోన్నతులు చేసే అవకాశం ఉందని రాష్ట్ర సంచాలకులు దేవసేనకు తెలియజేశారని తెలిపారు. అదే విధంగా స్టే వెకేట్ చేయటానికి ప్రభుత్వ పక్షాన, సంఘం పక్షాన పిటిషన్ వేశామన్నారు.

● మరోపక్క గత నెలలో వేణుగోపాల్ చర్చి భాషా పండితుల పదోన్నతులపై ఉన్న కేసులన్నీ ఒకే బెంచిపైకి తీసుకురావాలన్నారు. ఈ నేపథ్యంలో రకరకాల బెంచీలపై ఉన్న కేసులను ఒకే బెంచ్‌పైకి తెచ్చే ప్రక్రియలు సంఘం పని చేస్తుందని తెలిపారు. ఈ ప్రక్రియకు వారం రోజులు సమయం పట్టవచ్చన్నారు. ముఖ్యమంత్రి 2017లో ఇచ్చిన హామీ మేరకు త్వరగా భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి బి. స్వప్న, సీనియర్ భాషా పండితులు చంద్రశేఖర్, జిల్లా సహాధ్యక్షులు కృష్ణగౌడ్, సలహాదారులు మాణిక్యం, జిల్లా కార్యదర్శులు సాయిగీతిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132